
# సంగీత ప్రయాణంలో కుబేర



సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో ధనుష్, నాగార్జునల 'కుబేర' సినిమా ఒకటి. టాలీవుడ్ క్రియేటివ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్‌ని కూడా మేకర్స్ వేగవంతం చేశారు. రీసెంట్‌గా ఈ సినిమాకు చెందిన సెకండ్ గ్లింప్స్‌ని విడుదల చేశారు. 'ట్రాన్స్ ఆఫ్ కుబేర' పేరుతో ఉన్న ఈ వీడియో ప్రేక్షకుల్ని కుబేర ప్రపంచంలోకి తీసుకెళ్తుందని, సినిమాలోని కీలక పాత్రలనూ, అవి క్రియేట్ చేయబోయే తుఫాన్‌లనూ ఈ గ్లింప్స్ ప్రజెంట్ చేస్తుందని మేకర్స్ తెలిపారు. దేవిశ్రీప్రసాద్ మ్యూజిక్ ఈ గ్లింప్స్‌లో హైలైట్‌గా నిలిచింది. 'నాది నాది నాది నాదే ఈ లోకం..' అనే కోరస్ శ్రోతల్ని ఆకట్టుకునేలా ఉంది. నందకిశోర్ రచించిన ఈ పాటను ధనుష్, హేమచంద్ర వేదాల కలిసి ఆలపించారు. నాగార్జున ఇందులో ఉద్వేగపూరితమైన నటనతో ఆకట్టుకుంటారని, విలువలతో నడుచుకునే వ్యక్తిగా కనిపించినా, ఆయన పాత్రలో అంతులేని ఎన్నో ప్రశ్నలుంటాయని మేకర్స్ చెబుతున్నారు. ఇక ధనుష్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని వారు తెలిపారు. రష్మిక మందన్న, జిమ్ సర్భ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని సునీల్ నారంగ్, పుస్కూర్ మోహన్‌రావు కలిసి నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

# ఆ నలుగురిలో నేను లేను



'పవన్‌కల్యాణ్ కోపంలో అర్థం ఉంది. ఆయన మాట్లాడిన ప్రతి విషయంలోనూ న్యాయం ఉంది. నేను పూర్తిగా ఆయనకు ఏకీభవిస్తున్నా. పవన్ ఏపీ డిప్యూటీ సీఎం అయ్యాక మేం వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశాం. కానీ సినిమారంగంలో ప్రముఖులమని చెప్పుకునే చాలా మంది.. పవన్ మాకు తెలుసు అనుకున్నారే గానీ.. ఆయన్ను కలవాలనే ఆలోచన మాత్రం ఎవరూ చేయలేదు. ఇది పూర్తిగా తప్పు. 'జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేద్దాం అనుకుంటున్నాం.. మీటింగులకి రండి..' అని నన్ను కూడా పిలిచారు. ఈ విషయంపై మూడుసార్లు ఛాంబర్‌లో మీటింగులు జరిగాయి. కానీ నేను ఏ మీటింగుకీ వెళ్లలేదు. వారి నిర్ణయం సమంజసంగా అనిపించలేదు కాబట్టే మీటింగులకు దూరంగా ఉన్నా. థియేటర్లకు సమస్యలున్నాయి. వాటిని ప్రభుత్వంతో కలిసి చర్చించి పరిష్కరించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. అంతేకానీ తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే ఎలా?. అయినా పవన్‌కల్యాణ్ సినిమా విడుదల కాబోతున్న సందర్భంలో థియేటర్లు మూసేస్తామని అనడం నిజంగా దుస్సాహసమే.' అని అగ్ర నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. చిత్రపరిశ్రమలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై నిర్మాత అల్లు అరవింద్ స్పందించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇంకా మాట్లాడుతూ ' 'ఆ నలుగురు' అంటూ గత రెండుమూడు రోజులుగా వార్తలొస్తున్నాయి. ఆ నలుగురి కబంధ హస్తాల్లోనే ఇండస్ట్రీ ఉన్నట్టు, ప్రస్తుత పరిణామాలకు ఆ నలుగురే కారణం అన్నట్టు వార్తలు రాస్తున్నారు. అందరూ అనుకుంటున్న 'ఆ నలుగురు'లో నేను లేను. ఆ నలుగురికీ నాకూ ఎలాంటి సంబంధం లేదు. నిజానికి 'ఆ నలుగురు' అనేది 15ఏళ్ల నాటి మాట. ఇప్పుడు అలాంటివాళ్లు పదిమంది తయారయ్యారు.' అని అల్లు అరవింద్ గుర్తుచేశారు. 'సినిమాలు నిర్మించడం మాత్రమే నా వృత్తి. 50ఏండ్లుగా అదే వృత్తిలో ఉన్నా. థియేటర్ల వ్యాపారం నుంచి కోవిడ్ సమయంలోనే బయటకు వచ్చేశా. తెలుగురాష్ట్రాల్లో ప్రస్తుతం నాకుంది 15 థియేటర్లు మాత్రమే. అవి కూడా త్వరలో ఉండవ్. లీజు పూర్తయ్యాక రెన్యువల్ చేయొద్దని స్టాఫ్‌కి చెప్పేశాను. ఏదిఏమైనా.. సినిమా ఇండస్ట్రీ నుంచి వెళ్లి.. పోరాడి, డిప్యూటీ సీఎం స్థాయికి ఎదిగిన వ్యక్తి పవన్‌కల్యాణ్. ఆయన సినిమా విడుదల సమయంలో ఇలాంటి పరిణామాలు తలెత్తడం బాధాకరం' అని అల్లు అరవింద్ ఆవేదన వ్యక్తం చేశారు.

# కలెక్షన్స్ కాదు.. కంటెంట్ ముఖ్యం!



**సమకాలీన** సినిమా మొత్తం వ్యాపారాత్మకంగా మారిపోయిందని, ఇదే ధోరణి కొనసాగితే భవిష్యత్తులో కథాంశాల్లో నాణ్యత కొరవడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు ప్రముఖ దర్శకుడు మణిరత్నం. ఆయన దర్శకత్వంలో కమల్‌హాసన్ కథానాయకుడిగా నటించిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'థగ్‌లైఫ్' జూన్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో మణిరత్నం సినిమా కలెక్షన్లపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. దక్షిణాదిలో వెయ్యి కోట్ల వసూళ్లు రాబట్టే సినిమాలను ఎందుకు చేయలేకపోతున్నాం? అని ఓ విలేకరి ప్రశ్నకు మణిరత్నం సమాధానమిచ్చారు. భారీ కలెక్షన్స్ ముఖ్యమా? లేదా హృదయాన్ని తడిమే భావోద్వేగాలు కలిగిన కథలు ముఖ్యమా? అని ప్రేక్షకులు విశ్లేషించుకోవాలి. ఒకప్పుడు సినిమాలు విడుదలైతే దాని కంటెంట్, టేకింగ్ గురించి చర్చించుకునేవారు. ఇప్పటి సినిమాల్లో ఏవో కొన్ని అంశాలు మాత్రమే ప్రేక్షకుల్ని ఎగ్జయిట్ చేస్తున్నాయి. ఏదిఏమైనా కేవలం వసూళ్లను దృష్టిలో పెట్టుకొని సినిమాలు చేయడం నాకు ఇష్టం ఉండదు' అని మణిరత్నం అన్నారు. 'నాయకన్' (1987) తర్వాత మణిరత్నం-కమల్‌హాసన్ కాంబోలో వస్తున్న 'థగ్‌లైఫ్' సినిమాపై దేశవ్యాప్తంగా అంచనాలు ఉన్నాయి.



# యువతరం యుఫోరియా

నూతన నటీనటులతో దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కిస్తున్న ట్రెండీ మూవీ 'యుఫోరియా'. నీలిమ గుణ నిర్మాత. భూమిక చావ్లా, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత యలమంచిలి, అడ్డాల పృధ్వీరాజ్, కల్పలత, సాయి శ్రీనికా రెడ్డి, అశ్రిత వేముగంటి, మాథ్యూ వర్గీస్, ఆదర్శ్ బాలకృష్ణ, రవి ప్రకాశ్, నవీనారెడ్డి, లికిత్ నాయుడు ఇందులో ముఖ్య పాత్రధారులు. ప్రస్తుతం సినిమా నిర్మాణదశలో ఉంది. మేకర్స్ ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ ఈవెంట్‌లో ఈ సినిమాలోని 'ఫ్లై హై..' అంటూ సాగే గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. కిట్టు విస్సాప్రగడ రాసిన ఈ గీతాన్ని కాలభైరవ స్వరపరిచి, పృధ్వీచంద్ర, గాయత్రి నటరాజన్‌లతో కలిసి ఆలపించారు. యువత మత్తులో మునగడం, నైట్ అవుట్స్, ఫ్రెండ్స్‌తో పార్టీలు ఇలాంటి విపరీత పోకడలను ఈ పాటలో చూపించారు. యూత్‌కి ఇన్‌స్టంట్ కిక్ ఇచ్చేలా పాటను చిత్రీకరించినట్టు తెలుస్తున్నది. 'ఆడియెన్స్ చూపించే ఎనర్జీయే 'యుఫోరియా'. ఇదే ఎనర్జీ సినిమాలోనూ ఉంటుంది. ఇందులో కొత్తవాళ్లు పరిచయం అవుతున్నారు. పని చేసిన అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా ఇది. నేను చేస్తున్న ఈ వినూత్న ప్రయత్నం అందరికీ నచ్చుతుందని నమ్మకంతో ఉన్నా.' అని దర్శకుడు గుణశేఖర్ చెప్పారు. ఇంకా చిత్రయూనిట్ మొత్తం మాట్లాడారు. ఈ చిత్రానికి మాటలు: నాగేంద్ర కాశి, కృష్ణహరి, కెమెరా: ప్రవీణ్ కె.పోతన్, సమర్పణ: రాగిణి గుణ, నిర్మాణం: గుణ హ్యాండ్‌మేడ్ ఫిల్మ్స్.

# చిన్ని చిన్ని తప్పులేవో..

అర్జున్ అంబటి కథానాయకుడిగా రూపొందుతోన్న థ్రిల్లర్ మూవీ 'పరమపద సోపానం'. జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్ కథానాయిక. నాగశివ దర్శకుడు. గడిమిట్ల శివప్రసాద్ నిర్మాత. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈ చిత్రం జూలై 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్స్‌ని వేగవంతం చేశారు. ఈ క్రమంలో సినిమాలోని 'చిన్ని చిన్ని తప్పులేవో..' అని సాగే పాటను మేకర్స్ విడుదల చేశారు. రాంబాబు గోశాల రాసిన ఈపాటను, డేవ్ జాండ్ స్వరపరచగా పృధ్వీ చంద్ర, అదితి బావరాజు కలిసి ఆలపించారు. యువతను ఆకర్షించే రీతిలో ఈ పాట సాహిత్యం, చిత్రీకరణ సాగింది. ఈ చిత్రానికి కెమెరా: ఈశ్వర్, సహ నిర్మాత: గుడిమిట్ల ఈశ్వర్, నిర్మాణం: ఎస్.ఎస్.మీడియా.



# ఆ స్మెల్ నాకెంతో ఇష్టం



ప్రస్తుతం ఇండియాలోని టాప్ హీరోయిన్లలో రష్మిక మందన్నా మొదటి వరుసలో ఉంటారు. ప్రస్తుతం రూపొందుతోన్న ప్రస్టేజియస్ సినిమాల్లో ఎక్కువ శాతం కథానాయిక రష్మికే. బాలీవుడ్‌లో సైతం ఈ అందాలభామ వైభవం ఓ రేంజ్‌లో వెలిగిపోతున్నది. ఎంత బిజీగా ఉన్నా సోషల్‌మీడియా ద్వారా అభిమానులకు చేరుగానే ఉంటూ ఉంటుంది రష్మిక. రీసెంట్‌గా సోషల్ మీడియాలో వర్షాలపై ఆసక్తికరంగా ఓ పోస్ట్ పెట్టింది తను. 'వర్షాకాలం వచ్చేసింది. నిజానికి నాకు వర్షాకాలం అంటే ఇష్టం ఉండదు. ఎందుకంటే వర్షాల వల్ల పనులు మందగిస్తాయి. వర్క్ స్పీడ్‌గా జరగదు. అయితే.. వర్షం వచ్చే ముందు వచ్చే మట్టి వాసన అంటే మాత్రం నాకెంతో ఇష్టం. ఆ స్మెల్ వస్తే.. గుండెల నిండా పీల్చేసుకుంటా.' అంటూ పోస్ట్ చేసింది రష్మిక.

# ఆ లోటు తీర్చిన షష్టిపూర్తి



'నిజజీవితంలో షష్టిపూర్తిని తప్పించుకోవాలని ప్రయత్నించా. కానీ సినిమా రూపంలో నాకిలా షష్టిపూర్తి జరిగిపోయింది. సాధారణంగా పెళ్లిళ్లలో నా 'పెళ్లిపుస్తకం'పాటే వినిపిస్తుంటుంది. 'ఆ నలుగురు' విడుదలైన తర్వాత చావు విషయంలోనూ నా పాటే వినిపించడం మొదలైంది. 'షష్టిపూర్తి' టైమ్‌లో నా పాట లేదని చాలామంది అనేవాళ్లు. ఇప్పుడు 'షష్టిపూర్తి' పాట కూడా వచ్చేసింది. పైగా ఈ పాటను ఇళయరాజా చేయడం నా అదృష్టం. అలాగే అర్చనతో ఇన్నేళ్ల తర్వాత కలిసి నటించడం ఆనందంగా ఉంది. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాల్ని చాటిచెప్పే సినిమా ఇది. బిడ్డలు చూడగలిగిన తల్లిదండ్రుల పెళ్లే ఈ 'షష్టిపూర్తి'.' అని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆయన, అర్చన జంటగా, రూపేష్, ఆకాంక్ష సింగ్ మరో జంటగా రూపొందిన ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'షష్టిపూర్తి'. పవన్‌ప్రభ దర్శకత్వంలో రూపేష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా విజయవాడలో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. ఏపీ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు, బోడె ప్రసాద్ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. కథే ఈ చిత్రానికి ప్రధాన బలమని, రాజేంద్రప్రసాద్, అర్చన కాంబినేషన్లో సినిమా చేయడం సంతోషంగా ఉందని, ఇళయరాజా సంగీతం ఈ సినిమాకు మెయిన్ పిల్లర్ అని, సాంకేతికంగా అభినందనీయంగా సినిమా ఉంటుందని హీరో, నిర్మాత రూపేష్ తెలిపారు. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చే సినిమా ఇదని డైరెక్టర్ పవన్ ప్రభ అన్నారు. ఇంకా నటి అర్చన, హీరోయిన్ ఆకాంక్ష సింగ్, గీత రచయిత చైతన్య ప్రసాద్ కూడా మాట్లాడారు..

# కల నెరవేరడం ఖాయమేనా?



సినిమా పరిశ్రమ అంటేనే ఓ పరమపద సోపానపటం. ఎప్పుడు ఎవరు నిచ్చెనలు ఎక్కేస్తారో.. ఎవరు కాలసర్పాలతో కరవబడతారో చెప్పలేం. ప్రస్తుతం హీరోయిన్ కయదు లోహర్ నిచ్చెనలమీద నిచ్చెనలు ఎక్కేస్తున్నది. ఈ అందాలభామ తొలిసినిమాకు తీసుకున్న పారితోషికం 20 లక్షలని టాక్. 'డ్రాగన్' పుణ్యమా అని ఏకంగా ఇప్పుడు రెండు కోట్లు డిమాండ్ చేస్తున్నదని కోలీవుడ్ టాక్. ఒక్క సినిమాతో ఫేట్ మారిపోవడమంటే ఇదే. ప్రసుతం తెలుగులో విశ్వక్‌సేన్ 'ఫంకీ' సినిమాలో కథానాయికగా నటిస్తున్న కయదు.. తమిళంలో 'శింబు'తో ఓ సినిమా చేయబోతున్నది. మరో నాలుగైదు ప్రాజెక్టులు కూడా లైన్‌లో ఉన్నాయట. సోషల్ మీడియాలో కూడా ఈ అమ్మడి ఫాలోవర్స్ సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. ఇటీవల ఓ చిట్‌చాట్‌లో ఈ అందాలభామ మాట్లాడుతూ 'హీరోయిన్ కావడం మాత్రమే కాదు, నటిగా చాలా సాధించాలి. ఎన్నో ఆశలతో ఈ రంగంలోకి వచ్చాను. డబ్బు ముఖ్యం కాదు. పదికాలాల పాటు నటిగా నా గురించి చెప్పుకోవాలి.' అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఉన్న స్పీడ్ చూస్తుంటే.. కయదు కల నిజమయ్యేలానే ఉంది.

# నా గుండెల్లో సంతోషంతో కూడిన కన్నీరుంది




'ఈ ప్రయాణంలో నాతో ఎందరో ఉన్నారు. ఇప్పటికీ వారు నాతో ప్రయాణిస్తూనే వున్నారు. నా గుండెల్లో సంతోషంతో కూడిన కన్నీరుంది. అలాగే బాధతో నిండిన కన్నీరు కూడా ఉంది. ఎన్నో తరాలుగా నన్ను ఆరాధిస్తున్న అభిమానదేవుళ్లకు ధన్యవాదాలు తప్ప మరేం చెప్పలేను.' అన్నారు కమల్‌హాసన్.. 'నాయకన్' వచ్చిన 38ఏండ్ల విరామం తర్వాత మణిరత్నం దర్శకత్వంలో కమల్‌హాసన్ నటించిన పాన్ ఇండియా గ్యాంగ్‌స్టర్ డ్రామా 'థగ్‌లైఫ్'. జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా చెన్నైలో భారీగా నిర్వహించిన ఆడియో లాంచ్ వేడుకలో అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతూ కమల్‌హాసన్ భావోద్వేగానికి లోనయ్యారు. ఇంకా ఆయన చెబుతూ 'ఈ ఆడియో వేడుకలో ముందు ఏ.ఆర్.రెహమాన్ గురించి చెప్పాలి. ఇళయరాజా తర్వాత సంగీతంలో నన్ను ఆ స్థాయిలో ముంచెత్తింది రెహ్మానే. ఈ సినిమాకు అద్భుతమైన పాటలిచ్చారాయన. నన్నూ, మణిరత్నంని సినిమా కలిపింది. మాకంటే మా ఇద్దరి సినిమానే ప్రేక్షకులు ఎక్కువగా ఇష్టపడతారని నాకు తెలుసు. ఈ సినిమా మీ ఆకలి తీరుస్తుంది. అద్భుతమైన టెక్నీషియన్స్ ఈ సినిమాకు పనిచేశారు. శింబు, త్రిష, అభిరామి, నాజర్, జోజో జార్జ్ వంటి గొప్ప నటీనటులు ఇందులో భాగం అయ్యారు. ఈ సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది.' అని కమల్‌హాసన్ నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా శింబు, మణిరత్నం, కన్నడ హీరో శివరాజ్‌కుమార్, త్రిష, అభిరామి, నాజర్, అశోక్‌సెల్వన్, డీవోపీ రవి కె.చంద్రన్ తదితరులు కూడా మాట్లాడారు.

# సర్దార్ డబుల్ ఇంపాక్ట్



అగ్ర హీరో కార్తీ 'సర్దార్' చిత్రం తెలుగు, తమిళ భాషల్లో భారీ విజయాన్ని సాధించిన విషయం విదితమే. ఈ సినిమా సీక్వెల్‌గా 'సర్దార్ 2' సినిమా ప్రస్తుతం తెరకెక్కుతున్నది. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ 'సర్దార్2'కి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయ్ ఫిమేల్ లీడ్స్‌గా నటిస్తున్న ఈ సినిమాకు నిర్మాత ఎస్. లక్ష్మణ్. కార్తీ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం ఈ సినిమా స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. కార్తీ మ్యాసీవ్ మిషిన్ గన్ పట్టుకొని రగ్గడ్ లుక్‌తో ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. కార్తీ పాత్ర ఈ సినిమాలో ఎంత శక్తివంతంగా ఉంటుందో ఈ పోస్టర్ చెబుతున్నది. ఎస్.జె.సూర్య కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జార్జ్ సి.విలియమ్స్, సంగీతం: యువన్ శంకర్‌రాజా, సహనిర్మాత: ఎ.వెంకటేష్, నిర్మాణం: ప్రిన్స్ పిక్చర్స్.



# బలగం చిన్న తాత జీవీ బాబు ఇకలేరు

'బలగం' సినిమాలో చిన్న తాత పాత్ర పోషించిన రంగస్థల నటుడు జీవీ బాబు కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆదివారం తుదిశ్వాస విడిచారు. జీవీ బాబు రంగస్థల నటుడిగా పేరు ప్రఖ్యాతుల్ని సాధించారు. ఆయన మరణం పట్ల తెలంగాణకు చెందిన పలువురు సినీ, నాటకరంగ కళాకారులు సంతాపం వెలిబుచ్చారు. 'బలగం' చిత్ర దర్శకుడు వేణు యల్దెండి తన ఎక్స్(ట్విటర్)లో జీవీ బాబు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. 'జీవీ బాబు ఇకలేరు. తన జీవితాన్ని నాటకరంగానికే అంకితం చేశారాయన. చివరిరోజుల్లో ఆయన్ను 'బలగం' సినిమా ద్వారా వెండితెరకు పరిచయం చేసే భాగ్యం నాకు దక్కింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి.'అని ట్విటర్‌లో పోస్ట్ చేశారు దర్శకుడు వేణు యల్దెండి.